

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 26-11-2025 | సంపుటి - 25 | సంచిక -190 | రూ : 4 | పేజీలు: 8


## కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు..

### తాజాగా 28 మంది సరెండర్



2లో

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ
- లొంగిపోయిన వారిలో 19 మంది మహిళలు
- వీరిపై రూ. 89 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడి
- 'పున మర్గం' కార్యక్రమం సత్ఫలితాల నిస్తున్నాయన్న అధికారులు
- ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోలు

## ఇక భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల తయారీ..




2లో

- ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జాయింట్ వెంచర్
- 70 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల స్మార్ట్ బాంబు
- 60 శాతం విడిభాగాలు దేశీయంగానే ఉత్పత్తి చేసేలా ప్రణాళిక




ఢిల్లీలో వాయు కాలుష్యం..

## రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం

2లో

- ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం
- కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- విద్యుత్ వాహనాలను విస్తృతపరిచే చర్యలు ముమ్మరం చేయాలని సూచన

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్..

### మూడు విడతల్లో పోలింగ్

- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల నియమావళి
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్




2లో



2లో

## ఆ అధ్యక్షుడిని మార్చండి..!

సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి ఘాటు లేఖ

- పున్నా కైలాశ్ తమ కుటుంబం పట్ల తీవ్ర పదజాలం ఉపయోగించారన్న మంత్రి
- అతనిని వెంటనే డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్

## రాష్ట్రంలో 'ఏపీలింక్' ఏర్పాటు

### లాజిస్టిక్స్ రంగంపై సీఎం చంద్రబాబు ఫోకస్



2లో

- ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ-లింక్) ఏర్పాటుకు సీఎం ఆమోదం
- పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు సహా ఐదు కీలక రంగాల అనుసంధానం

## బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్‌గా సీఎం

- ఈ నెల 28న ఘనంగా జరగనున్న వేడుక
- షూటింగ్ బిజీ వల్ల రాలేకపోతున్న అల్లు అర్జున్
- డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల
- డిసెంబర్ 4న ప్రీమియర్ షోలకు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు

2లో





2లో

## తెలంగాణ బ్రాండింగ్ విశ్వవ్యాప్తమవ్వాలి

- ఆ స్థాయిలో గ్లోబల్ సమిట్ నిర్వహించాలి
- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

# కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు... తాజాగా 28 మంది సరెండర్

ఛత్తీస్‌గఢ్, నవంబర్ 25: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాద్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు ఒక ఎస్‌ఎల్ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు. గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం..
## రంగంలోకి దిగిన ప్రధానమంత్రి కార్యాలయం

ఢిల్లీ, నవంబర్ 25: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకరంగా పడిపోతున్న నేపథ్యంలో పీఎంవో రంగంలోకి దిగింది. కాలుష్యానికి కారకమయ్యే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు చర్యలు ముమ్మరం చేయాలని సూచించింది. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఢిల్లీలోని వాయు నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో వాహనాల కాలుష్యం ప్రధానాంశంగా ప్రస్తావనకు వచ్చింది. దేశ రాజధానిలో ఇంకా 37 శాతం మేర పాత వాహనాలు వినియోగంలో ఉన్నట్లు సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వాటి స్థానంలో ఈవీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఈవీ వాహనాలకు రాయితీలు ఇవ్వడంతో పాటు ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. కాలుష్య కారక పెట్రోల్, డీజిల్ వాహనాలు వినియోగాన్ని తగ్గించాలని అన్నారు.

# రాష్ట్రంలో 'ఏపీ-లింక్' ఏర్పాటు...
## లాజిస్టిక్స్ రంగంపై సీఎం చంద్రబాబు ఫోకస్

అమరావతి, నవంబర్ 25: ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్" (APLInC ఏపీ లింక్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం నాడు సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన ఆమోదం తెలిపారు. ఈ కార్పొరేషన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక హోల్డింగ్ కంపెనీ తరహాలో పనిచేయనుంది. రాష్ట్రంలోని పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులు అనే ఐదు కీలక రంగాలను ఏపీలింక్ అనుసంధానిస్తుంది. తద్వారా లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు, ఈ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం దీని ప్రధాన బాధ్యత. రాష్ట్రంలోని లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీలింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్పొరేషన్‌కు ఒక మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, ఒక సలహా కమిటీ ఉంటాయని ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల అమలు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏపీలింక్ ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అన్ని రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ సేవలను సమన్వయంతో అందించాలని ఆయన సూచించారు.

# మంత్రి నారా లోకేశ్
## 75వ రోజు ప్రజాదర్బార్... వెల్లువెత్తిన వినతులు

అమరావతి, నవంబర్ 25: రాష్ట్ర ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసే లక్ష్యంతో ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన 75వ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. వారి నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కొన్ని క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే తన సిబ్బందికి, సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

* **లోకేశ్ దృష్టికి వచ్చిన పలు సమస్యలు**

ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో పలువురు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

* గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో తనపై అక్రమ కేసులు బనాయించి, కుటుంబాన్ని తీవ్ర క్షోభకు గురిచేశారని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.
* పీజీ పూర్తి చేసినా ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్నానని, ఉపాధి అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా గోవిందపల్లెకు చెందిన పగిడి వెంకటలక్ష్మి మంత్రిని అభ్యర్థించారు.
* గుంటూరు జిల్లా కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70 మంది సభ్యులు పొదుపు చేసిన రూ.7.55 కోట్ల నగదును సీఈవో దుర్వినియోగం చేశారని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని సంఘ సభ్యులు విన్నవించారు.
* మంగళగిరి నియోజకవర్గం పెద్దవడ్లపూడిలో తమ 0.39 ఎకరాల వ్యవసాయ భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కుర్రా వెంకట్రావు కోరారు.
* రాష్ట్రంలో రిటైర్డ్ పార్ట్‌టైమ్ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.4 వేల పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని ఏపీ రిటైర్డ్ పార్ట్‌టైమ్ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
* అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారుడి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందించాలని విజయనగరం జిల్లాకు చెందిన వి.నాగభూషణం కోరారు.
* దివ్యాంగురాలైన తనకు జీవనోపాధి కోసం ట్రైస్కూటీ అందజేయాలని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ సుభాన్ బీ విన్నవించారు.
* పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు రూ.15 వేల పెన్షన్ అందించి ఆదుకోవాలని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన వై. మహాలక్ష్మి అభ్యర్థించారు.

ఈ విజ్ఞప్తులన్నింటినీ సావధానంగా పరిశీలించిన మంత్రి లోకేశ్, వాటిపై సానుకూలంగా స్పందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా నిలుస్తామని వారికి హామీ ఇచ్చారు.

# తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు
## నోటిఫికేషన్..

హైదరాబాద్, నవంబర్ 25: దేతెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సాయంత్రం మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని ఆమె అన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను సెప్టెంబర్ 29న ప్రకటించామని, కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే వచ్చిందని ఆమె గుర్తు చేశారు. తొలి దశలో 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు... రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలకు, 38,350 వార్డులకు... మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు, 36,452 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.66 కోట్ల మంది గ్రామ ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లను నవంబర్ 27 నుంచి స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు నవంబర్ 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు.

# ఇక భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల తయారీ..

ఢిల్లీ, నవంబర్ 25:భారత రక్షణ రంగం ఆత్మనిర్భరత దిశగా మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే 'హామర్' స్మార్ట్ బాంబులను తయారు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ , ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ & డిఫెన్స్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై బీఈఎల్ సీఎండీ మనోజ్ జైన్, సఫ్రాన్ ఈవీపీ అలెగ్జాండర్ జీగ్లర్ సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలు కలిసి 50:50 వాటాలతో ఒక జాయింట్ వెంచర్ కంపెనీని (JVC) ఏర్పాటు చేయనున్నాయి. గతంలో 2025 ఫిబ్రవరిలో జరిగిన ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందం ఇప్పుడు కార్యరూపం దాల్చింది. హామర్ అనేది ఫ్రాన్స్‌కు చెందిన అత్యంత అధునాతన ఎయిర్‌టుగ్రౌండ్ స్మార్ట్ బాంబు. రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగిస్తే ఇది 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు బంకర్లు, కమాండ్ సెంటర్లు, రాడార్లను కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. గగనతలంలో తన మార్గాన్ని మార్చుకోగల సామర్థ్యం, జామింగ్‌ను తట్టుకోగల శక్తి దీని సొంతం. ఈ ఒప్పందం వల్ల 'మేకిన్ ఇండియా' కార్యక్రమానికి పెద్దపీట వేసినట్లయింది. తొలుత కొన్ని విడిభాగాలను ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నా, దశలవారీగా 60 శాతం ఎలక్ట్రానిక్, మెకానికల్ భాగాలను దేశీయంగానే తయారు చేస్తారు. తయారీ, పరీక్ష, నాణ్యత నియంత్రణ బాధ్యతలను బీఈఎల్ చూసుకోనుంది. దీనివల్ల భారత వాయుసేన, నౌకాదళం అవసరాలకు విదేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అలాగే తేజస్ యుద్ధ విమానాల్లోనూ వీటిని అమర్చే అవకాశం ఉంటుంది. త్వరలోనే ఈ అత్యంత శక్తివంతమైన ఆయుధం భారత గడ్డపై తయారీ కానుంది.

# బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్ గా సీఎం

హైదరాబాద్, నవంబర్ 25: నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు, డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.

# తెలంగాణ బ్రాండింగ్ విశ్వవ్యాప్తమవ్వాలి

హైదరాబాద్: తెలంగాణ బ్రాండింగ్ విశ్వవ్యాప్తమయ్యే విధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డిసెంబరు 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న సమిట్‌కు సంబంధించి బ్రాండింగ్‌పై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం రాత్రి సీఎం సమీక్ష నిర్వహించారు. సమిట్‌కు సంబంధించి వివిధ సంస్థలు రూపొందించిన ప్రచార చిత్రాలు, వీడియోలను ముఖ్యమంత్రి వీక్షించి, పలు మార్పులు చేర్పులు సూచించారు. "భారత్ ఫ్యూచర్ సిటీలో విభాగాల వారీగా మనం చేపట్టే పనులకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రచారంలో ప్రముఖంగా ఉండేలా జాగ్రత్త పడాలి. పెట్టుబడిదారులకు మనం కల్పించే సదుపాయా లను సమగ్రంగా వివరించాలి. హైదరాబాద్‌కు అనుకూల అంశాలైన ఇన్నర్ రింగు రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు, రానున్న రీజినల్ రింగు రోడ్డు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే, రైలు మార్గం, డ్రైపోర్ట్‌తో పాటు.. తెలంగాణలోని కళా, సాంస్కృతిక, భాష, వాతావరణ అనుకూలతలను వివరించాలి. రాష్ట్రంలో 1999 నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా.. విధానపరమైన నిర్ణయాల్లో ఎటువంటి మార్పుల్లేని అంశాన్ని, పెట్టుబడుల విషయంలో మద్దతుగా నిలుస్తున్న విషయాన్ని బలంగా నొక్కి చెప్పాలి. మన రాష్ట్రానికే పరిమితమైన, వైవిధ్యమైన రామప్ప ఆలయంలోని నంది, సమ్మక్క సారక్క జాతర, నల్లమల పులులు, మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రత్యేకమైన ఎద్దులు, తెలంగాణ నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన పి.వి.నరసింహారావు వంటి ప్రముఖులు, కళాకారులు, క్రీడాకారులు, అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న దిగ్గజాలు.. ఇలా ప్రతి ఒక్క అంశానికి తెలంగాణ బ్రాండింగ్‌లో చోటు కల్పించాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ వేదికలను బ్రాండింగ్‌కు సమర్థంగా వినియోగించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమిట్‌పై ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ అధ్యక్షుడిని మార్చండి!

హైదరాబాద్, నవంబర్ 25: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఒక లేఖ రాశారు. నల్గొండ డీసీసీ అధ్యక్షుడిని వెంటనే మార్చాలని ఆయన ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఇటీవల జిల్లా అధ్యక్షుల నియామకంలో భాగంగా నల్గొండ డీసీసీ అధ్యక్షుడిగా నియమించబడిన పున్నా కైలాశ్ గతంలో తన పట్ల, తన కుటుంబం పట్ల తీవ్ర పదజాలం ఉపయోగించారని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని తక్షణమే డీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మీడియా ముందు తమను అసభ్య పదజాలంతో దూషించి అవమానించారని, సామాజిక మాధ్యమాలలో కూడా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయిందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఇది తమ కుటుంబాన్ని బాధించిందని అన్నారు. ఈ మేరకు ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. అలాగే, అతనిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా సరైన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని కోరారు. మరోవైపు, కొత్త డీసీసీ అధ్యక్షుడు కైలాశ్‌కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్దతు తెలిపారు.

# సమాజ మార్పు దిశగా నడిచే నిజమైన శక్తి జర్నలిజమే

* తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ జగన్



బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిజం కేవలం వార్తల సేకరణ మాత్రమే కాకుండా, సమాజ మార్పుకు దారి చూపే శక్తివంతమైన ఆయుధమని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ జగన్ అన్నారు. నిజాయితీతో, లోతైన పరిశోధనతో, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ జర్నలిజం సమాజంలో మంచి పరివర్తన తీసుకురాగలదని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ పర్రెపాటి ఆధ్వర్యంలో ప్రజా చైతన్యానికి అద్దం పట్టే విధంగా వెలువడుతున్న మహాసముద్రం పక్ష పత్రికను హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఛాంబర్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.మహాసముద్రం పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలు ప్రజలలో ఆలోచన రేకెత్తించే శక్తి కలిగినవని, లోతైన విశ్లేషణతో, సామాజిక సున్నితాంశాలను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉన్నాయని ఏ జగన్ ప్రశంసించారు. "పత్రికలోని రచనలు కేవలం సమాచారం మాత్రమే ఇవ్వడం కాదు... సమాజాన్ని ఆలోచింపచేసి, మార్పు వైపు నడిపించే శక్తి లాగా ఉండాలని, ఇది నిజమైన జర్నలిజం," అని ఆయన అభిప్రాయపడ్డారు. మహాసముద్రం పత్రిక మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని, ప్రజా ప్రయోజనాలకు అద్దం పట్టే నిబద్ధతతో ఈ పత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు.సమాజంలో నిస్సహాయులకు న్యాయం చేసేది కోర్టు అయితే, ఆ న్యాయం అవసరం ఎక్కడ ఉందో, ఎక్కడ అన్యాయం జరుగుతుందో చెప్పేది జర్నలిస్టులేనని ఆయన పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధిలా పనిచేసేది పత్రికా రంగమనీ, అందువల్ల జర్నలిస్టులు ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా, సత్యనిష్ఠతో ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. "జర్నలిజంలో ఇదే ధోరణి కొనసాగాలి. రచనలు ప్రజలను మేల్కొల్పాలి. అది నిజమైన సేవ," అని ఏ జగన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, ప్రభుత్వ న్యాయవాదులు, ఏజీపీలు పాల్గొని మహాసముద్రం పత్రిక ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రామాలయంలో దేవత మూర్తుల విగ్రహాల ఆవిష్కరణ

* మాజీ మున్సిపల్ చైర్మన్ మడత రమ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : ఇల్లందు పట్టణం లోని ఎనిమిదో వార్డు నందుగల శ్రీ సీతారామ ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్టాపన, గణపతి, దుర్గ మాత, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నందీశ్వర స్వామి విగ్రహాలను వేద పండితుల సమక్షంలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ మడతరమా వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మీ, డిఎస్పి చంద్రబాను దంపతులు, మడతరమ వెంకట్ గౌడ్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదానం లో ఇల్లందు మండలం, పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏక్తా హౌస్ టీం సభ్యులు మామిడి శివ, కోటగిరి రాజు, మెరుగు భరత్, కంది సదానందం, మునాఫ్, బాణాల శ్రీనివాస్,రేఖ రవిశంకర్, స్వామి నాయక్, విక్కీ,గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాలలో భూపాల్ రెడ్డి సేవలు మరువలేనివి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఇటీవలే మరణించిన చౌటుప్పల్ మాజీ సర్పంచ్, సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతల భూపాల్ రెడ్డి మరణం కమ్యూనిస్ట్ ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరని లోటని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో చింతల భూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన కలిసి పరామర్శించారు. చింతల భూపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలో ఓ గొప్ప వామపక్ష నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, భూపాల్ రెడ్డి పోరాటం ఎంతోమంది ఈ ప్రాంతంలో స్ఫూర్తినిచ్చిందన్నారు. రైతాంగానికి పిలాయిపల్లి కాలువ ద్వారా సాగు నీరు కోసం అనేక దఫాలుగా ఉద్యమాన్ని నిర్వహించి సాగునీరు సాధించడంలో భూపాల్ రెడ్డి క్రియాశీలకమైన పాత్ర వహించారన్నారు. చౌటుప్పల్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ముందుచూపుతో వ్యవహరించే వారని కొనియాడారు. చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా చౌటుప్పల్ పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. సిపిఎం పార్టీలో అంచెలంచలుగా ఎదుగుతూ చౌటుప్పల్ ప్రాంతంలో అగ్రశ్రేణి నాయకుడుగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో అనేక మంది యువత పార్టీలోకి వచ్చారని, భూపాల్ రెడ్డి ఆశయ సాధన కోసం వామపక్షలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, బండారు నరసింహ, ఎండి పాషా, గోశిక కరుణాకర్, కొండూరు వెంకటేష్, దండ అరుణ్, ఉడుత రామలింగం, రొండి నరసింహ, టంగుటూరు రాములు, బద్దుల సుధాకర్ , బోయ మంకులు, దాసరి కృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలి

- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పత్తి తూకాలు వేసేటప్పుడు, కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవహరించాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సూచించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రగతి కాటన్ జీన్నింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, కావేరి కాటన్ జీన్నింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో పత్తి కొనుగోలు * కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. తూకం వేస్తున్న తీరును, పత్తి కొనుగోళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవాలని సూచించారు. పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్, డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి..

* రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా...
* స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ

అందోలు, ప్రజాస్ఫూర్తి: మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై ఆందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. మహిళలను చైతన్యం చేస్తేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది. మహిళా సాధికారతే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గంలోని 4039 మహిళా సంఘాలకు రూ.4.52 కోట్లు, జిల్లాలో 15909 సంఘాలకు మొత్తం రూ.18.25 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శకాలు అవుతున్నాయని మంత్రి అన్నారు. పావలా వడ్డీ రుణాలను ప్రవేశపెట్టిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిదే. 1994లోనే మహిళా సంఘాలను బలోపేతం చేసిన ప్రభుత్వ నాయకత్వం ఆయనదే. కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం కూడా సంఘాలకు మద్దతు ఇచ్చింది. అయితే గత పది సంవత్సరాలుగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల గురించిన మాటే లేకుండా పోయింది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను తిరిగి ఆర్థికంగా బలపరుస్తోంది అని మంత్రి దామోదర్ తెలిపారు. అభయహస్తం, ఆమ్ ఆద్మీ బీమా, గృహ జ్యోతి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు క్యాంటీన్లు-పెట్రోల్ పంపుల కేటాయింపు, సన్న బియ్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గ్రూపులకు భాగస్వామ్యం ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలని ఆయన గుర్తుచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఇందిరమ్మను అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇందిరమ్మ ఉక్కు మహిళ. బ్యాంకులను జాతీయాకరించిన ఘనత ఆమెదే. భూమిలేని పేదలకు భూములు కేటాయించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది కూడా ఇందిరమ్మే అని మంత్రి తెలిపారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తుండటం, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూ, నర్సింగ్, పాలిటెక్నిక్, మోడల్ కాలేజీల ఏర్పాటు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్ ప్రాధాన్యతతో కొనసాగుతున్నాయని వివరించారు. మహిళలు బాధ్యత, నిబద్ధత, కుటుంబాలను నిలబెట్టే శక్తి కలిగినవారు. ఆలోచన శక్తి, తరక శక్తి మహిళల్లో అపారంగా ఉంది. వారిని విద్యావంతులు చేసి, నైపుణ్యాలను పెంపొందిస్తే సమాజ అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ప్రపంచంలో ఏ దేశమైనా మహిళా సాధికారత ఉన్నప్పుడే అభివృద్ధి చెందుతుంది అని మంత్రి పేర్కొన్నారు. మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యలు జాతీయ రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి దరఖాస్తు చేయాలని సూచిస్తూ, ఆ భూములపై మహిళా సంఘాలు వ్యాపారాలు చేపట్టేందుకు లోన్లు, అవకాశాలు అందిస్తామని అన్నారు. మహిళలు కొత్త వ్యాపార ప్రణాళికలు రూపొందించి మరిన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో రూ.50 కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం మా ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, పిడి డిఆర్డిఓ జ్యోతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పెరిష, వివిధ మండలాల మహిళా సమక్ష అధ్యక్షులు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి చౌటుప్పల్ నాయకులను కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీసీ నాయకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల కొరకు చేస్తున్న పోరాటానికి మద్దతుగా పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై హైదరాబాద్ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు గట్టు మొగలయ్య ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న సమక్షంలో మంగళవారం టిఆర్పీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ లు మాట్లాడుతూ రాబోయే సర్పంచ్ ఎన్నికలలో బీసీల నుంచి యువత అధిక సంఖ్యలో పోటీ చేయాలన్నారు. బీసీల రాజ్యాధికారానికి పునాదులు వేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు గట్టు మొగలయ్య ముదిరాజ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మురళి ముదిరాజ్, పార్టీలో చేరిన మండల నాయకులు కడ్తాల యాదగిరి రజక, ఆరూరి శివ, ఉడుగు మహేష్, దండుగుల రామకృష్ణ, ఎర్ర రాజు యాదవ్, బాలగోని శివ గౌడ్ వివిధ గ్రామాల బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో సిపిఎం అభ్యర్థులను ఆదరించండి

- బూర్గు కృష్ణారెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను ఆదరించి.. గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బురుగు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో రాగీరు కిష్టయ్య సిపిఎం మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బురుగు కృష్ణా రెడ్డి హాజరై మాట్లాడారు. గత 100సంవత్సరాల చరిత్ర కలిగిన ఎర్రజెండా నాయకత్వాన అనేక ప్రజా పోరాటాలను నిర్వహించామన్నారు. ఐదు 5సంవత్సరాలు ఎంపీపీగా, 25సంవత్సరాలు సింగిల్ విండో చైర్మన్ గా నీతి, నిజాయితీగా ప్రజలకు సేవ చేసిన చరిత్ర సిపిఎం పార్టీకి ఉందన్నారు. కందాల రంగారెడ్డి, తిరందాసు గోపి, రొడ్డ అంజయ్య, చింతల భూపాల్ రెడ్డి నాయకత్వం స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకెళ్తామని, ప్రజలు సహకరించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్, పల్లె మధు కృష్ణ, పొట్ట శ్రీనివాస్ బోదాస్ వెంకటేష్, కొండే శ్రీశైలం, ఎల్లమల్ల సంజీవ, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, రోడ్డ సోని తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయంలో మొగుదాల హర్షిణి పుట్టిన రోజును పురస్కరించుకొని తల్లి తండ్రులు మొగుదాల సాహితి రమేష్ గౌడ్, తేజశ్రీలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలదారులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం మా కుటుంబ సభ్యుల అదృష్టమన్నారు. నిత్యం ప్రతి ఒక్కరు అయ్యప్ప నామస్మరణ చేయాలి కోరుకున్నారు. అన్న ప్రసాద వితరణ దాతలను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్ గురు స్వామి, వ్యవస్థాపక అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు గురుస్వామి, గురుస్వాములు, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, కంచరకుంట్ల వెంకటరెడ్డి, ఉప్పు ఆంజినేయులు, పెద్దగోని రమేష్ గౌడ్, సుక్క సుదర్శన్, మలిగె శ్రీను, తిరందాస్ జగన్నాథం, కుంటల శశికాంత్, పల్సం రాజేష్, పాశం కృష్ణ, బోరేం శ్రవణ్ కుమార్ రెడ్డి, కేతరాజు మహేష్, కొండమడుగు శ్రావణ్, పెంబర్ల గణేష్, అమృతం అశోక్, అల్లి కృష్ణ, మంద విజయ్ రెడ్డి, ముమ్మడి నవీన్, జాజుల శివ, తేజశ్వర్, ఉప్పు సాయిదుర్గ, జోగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న వారిని టెట్ రాయలనడం హాస్యాస్పదం

* టీఎస్ యుటిఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయసింహారెడ్డి, ఎం మదన్ రెడ్డి లు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న వారిని ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయలనడం హాస్యాస్పదమని టీఎస్ యుటిఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం మదన్ రెడ్డి లు అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సంఘ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జయసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సర్వీసు లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని డిమాండ్ చేశారు. ఎన్.సి.టి.ఈ నోటిఫికేషన్ ప్రకారం 23 ఆగస్టు 2010 కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని పేర్కొన్నందులకు గత 15 సంవత్సరాలుగా టెట్ రాయాలనే ఆలోచన చేయలేదని,టీటీసీ,డి.ఎడ్,బి. ఎడ్,తదితర ప్రొఫెషనల్ పరీక్షలు పూర్తి చేసి డియస్సి పరీక్ష రాసి మెరిట్లో ఎంపికై ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న వారిని టెట్ మినహాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సీనియర్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపునిస్తూ వెంటనే ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాలలో చట్టం చేయాలని టీఎస్ యుటిఎఫ్ సంఘ బాధ్యులు ముక్తకంఠంతో కోరారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ టీఎస్ యుటిఎఫ్ నాయకులు ఎస్. పురుషోత్తం,కె. కుమారస్వామి,కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గజిటెడ్ హెచ్ఎం జి.కమల్ సింగ్, ఉపాధ్యాయులు శ్రీరాములు, ఖాజా పాషా, మంజుల, ఎ.వసంత, శ్రీ వాసవి, సంధ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రకటించిన పంచాయతీ రిజర్వేషన్లు తక్షణమే రద్దు చేయాలి

* స్టేషన్ ఘన్పూర్ బీసీ జేఏసీ నేతల డిమాండ్




జనగామ జిల్లా : ప్రజాస్ఫూర్తి : స్టేషన్ ఘన్పూర్ మండలంలో ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన నిర్ణయించారు ప్రభుత్వం బీసీలకు పంచాయతీ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ ఇస్తానని బీసీలను నమ్మించి పనిచేయని జీవోలు ఇచ్చి గౌరవ కోర్టు ఆదేశాల మేరకు 50% మించకూడదని అనే విషయాన్ని సాకుగా చూపించి బీసీలకు గత ప్రభుత్వం ఇచ్చిన బీసీలకు 27% రిజర్వేషన్ కూడా ఇవ్వకుండా 16 శాతం మాత్రమే ఇచ్చి బీసీలను మరొక్కసారి మోసం చేసే ప్రయత్నం జరుగుతుంది కావున బీసీ లందరూ ఆలోచించాలి ఆలోచించాలిమండలంలో ఉన్న 15 గ్రామపంచాయతీ లకు గాను బీసీలకు అన్యాయం జరిగింది ఒకటి బీసీ జనరల్ గా ఒకటి బీసీ మహిళగా ప్రకటించినారు 15 గ్రామపంచాయతీలు ఉన్న మండలంలో బీసీలకు కేవలం రెండు కేటాయించడం ఈ బీసీలకు చేసిన అన్యాయంగా పరిగణించడం జరుగుతుంది తక్షణమే ఈ రిజర్వేషన్ రద్దుచేసి న్యాయబద్ధంగా బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నా ము ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్ గట్టు రమేష్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు జనగామ జిల్లా గడ్డం రాజు గౌడ్,నియోజకవర్గ బీసీ జేఏసీ కో కన్వీనర్లు పెసరు సారయ్య ముదిరాజ్,పొన్న శ్రీనివాస్ జేఏసీ,గట్టు శ్రీనివాస్ గౌడ్, మేకల మల్లేష్ యాదవ్, పులి శ్రీనివాస్ గౌడ్,గట్టు శివ, ఇల్లందుల రాజు,బోద్దున రవి నేత తదితరులు పాల్గొన్నారు.

## భూ విజ్ఞాన పరిశోధనకు కొత్త దిక్సూచి

**కొత్తగూడెంలో 'ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ' డిసెంబర్ 2న సీఎం చేతులమీదుగా ప్రారంభం**



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లాలో భూ విజ్ఞాన పరిశోధనకు భారీ ఊతం ఇవ్వబోతున్న డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో నియోజకవర్గానికి అరుదైన గౌరవం దక్కిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి ఆయన పరిశీలించారు.భవన సముదాయాలు, తరగతి గదులు, పరిశోధనా ల్యాబ్‌లు, ఆఫీసులు, క్రీడా మైదానాలను ఎమ్మెల్యే సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ "భద్రాద్రి జిల్లాకు ఇది చారిత్రాత్మక అవకాశం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలి యూనివర్సిటీ స్థాపన కోసం చేసిన కృషికి నేను గర్వపడుతున్నాను. ఇది కేవలం విద్యాసంస్థ కాదు... భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రం" అని పేర్కొన్నారు.యూనివర్సిటీతో భూవిజ్ఞానశాఖలో ప్రపంచ స్థాయి నిపుణులు తయారవుతారని, దీని వలన బొగ్గు, ఖనిజాలు, ఇంధన రంగాల్లో యువతకు విస్తారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రత్యక్ష, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.పరిశీలన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, మున్సిపల్ కమిషనర్ సుజాత, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి

- ముగిసిన ఖోఖో పోటీలు
- విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కే లింగయ్య




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కే లింగయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ పాఠశాల క్రీడా సమైఖ్య భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. సెమీ ఫైనల్ కు చేరిన జట్ల క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. కరచాలనం చేశారు. ఖోఖో క్రీడలను తిలకించారు. అండర్ 17 ఖోఖో జిల్లా స్థాయి పోటీలలో బాలుర విభాగంలో ప్రథమ స్థానం( ఆదిలాబాద్ జిల్లా), ద్వితీయ స్థానం( రంగారెడ్డి జిల్లా), తృతీయ స్థానం( కరీంనగర్ జిల్లా), బాలికల విభాగంలో ప్రథమ స్థానం(ఆదిలాబాద్ జిల్లా), ద్వితీయ స్థానం( మహబూబ్ నగర్ జిల్లా), తృతీయ స్థానం(నల్లగొండ జిల్లా) జట్లు గెలుపొందాయి. విజయం సాధించిన జట్లకు ఆయన ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కే లింగయ్య మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పంతంగి గ్రామంలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులు కృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కందాడి దశరథ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, క్రీడా పోటీల నిర్వాహకులు పొన్నగాని కృష్ణమూర్తి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## మలక్ పేట యశోదలో గర్భిణీకి అరుదైన చికిత్స..

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : హైదరాబాద్ మలక్పేట యశోద హాస్పిటల్లో గర్భిణీకి అరుదైన చికిత్స చేసి తల్లీ బిడ్డల ప్రాణాలు రక్షించినట్లు సీనియర్ గైనకాలజిస్ట్ లేపాక్షి దాసరి తెలిపారు. ఆమె మంగళవారం జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండకు చెందిన ఊర్మిళ అనే గర్భిణీ ప్లాసెంటా అక్రెటా కేసుతో యశోద ఆస్పత్రికి వస్తే ఆమె సీనియర్ వైద్యులైన గైనకాలిజిస్టులతో పాటు యూరాలజీ, అనస్థీషియా సహకారంతో ఇద్దరికి ఎలాంటి అపాయం లేకుండా శస్త్ర చికిత్స చేసి సఫలమైనట్లు తెలిపారు. ఐవీఎఫ్ ద్వారా గర్భం దరించిన సదరు మహిళ ప్లాసెంటా ప్రీవియా, అక్రెటా, ప్రీ గెస్టేషనల్ డయాబెటిస్, హైపోథైరాయిడిజం, హైపర్ టెన్షన్తో హాస్పటల్కు వచ్చినట్లు తెలిపారు. అయితే ఆమెకు ప్లాసెంటా అక్రెటాతో పాటు కడుపులో టీబీ కారణంగా ద్వారా బిగుసుకుపోయి కొయ్యబారిపోవటంతో శస్త్ర చికిత్స మాకు సవాలుగా మారినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో అయితే పరీక్షల్లో ఎలక్టివ్ ఎల్ఎస్ఎస్ చేస్తే ప్లాసెంటా పూర్తిగా అతుక్కొని పోయి ఉండటం వల్ల సటీటోటల్ సిజేరియన్ హిస్ట్రక్టమీ చేసి గర్భాశయాన్ని సైతం తొలగించినట్లు తెలిపారు. ప్లాసెంటా అక్రెటా ఉన్నప్పుడు రక్తస్రావం ఎక్కువగా అవుతుందని, ఫ్రొజెన్ పెల్విన్ ఉన్నప్పటికి సకాలంలో హైరిస్క్ చేసి శస్త్ర చికిత్స చేయటం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా సత్ఫలితాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ శ్రీకాంత్, వాసుకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలించిన డిఇఓ నాగలక్ష్మి




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 26, 27 తేదీల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో జరగనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను జిల్లా విద్యాధికారి నాగలక్ష్మి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సైన్స్ ఫెయిర్‌లలో ఎదురైన లోపాలను పునరావృతం కాకుండా, ప్రతి అంశంలోనూ పరిపూర్ణతతో నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భోజన వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల రాత్రి బస, ప్రదర్శనల అమరిక, న్యాయనిర్ణేతలు అనుసరించాల్సిన విధానాలు వంటి అంశాలపై అధికారులు, కమిటీ బాధ్యులతో నాగలక్ష్మి ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రతీ కమిటీ బాధ్యుడు తన బాధ్యతను సమిష్టి కృషితో నెరవేర్చాలని సూచించారు.26న ఉదయం 10 గంటలకు ప్రారంభం సెయింట్ మేరీస్‌లో 26 ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు డిఇఓ నాగలక్ష్మి తెలిపారు. ప్రోటోకాల్ సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సంపత్‌కుమార్, డిసిఇబి కార్యదర్శి నీరజ, మానిటరింగ్ అధికారులు నాగరాజ శేఖర్, సతీష్, సైదులు, కొత్తగూడెం ఎంఈఓ మధురవాణి, సెయింట్ మేరీస్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రూబీ, ఎంఈఓలు బాలాజీ, జంకిలాల్, ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ షేక్ దస్తగిరి, జహంగీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు అరుదైన గౌరవం.. మంత్రి కొండా సురేఖ చేతుల సర్టిఫికేషన్ అందజేత



హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కుకి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేషన్ లభించింది. అయితే, ఈ సర్టిఫికేషన్ ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా నెహ్రూ జులాజికల్ క్యూరేటర్ వసంతకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో అందజేశారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ వరుసగా ఆరు సంవత్సరాలు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేషన్ పొందిన దేశంలోనే మొట్టమొదటి జూ పార్కు అని మంత్రికి జూ ముఖ్య అధికారి వసంత తెలిపారు. ఐఎస్ఓ 9001 సర్టిఫికేట్ నాణ్యతా నిర్వహణ ప్రమాణాలను నిర్ధారిస్తుందని చెప్పారు. వీటిలో జూస్ స్థిరమైన సేవా నాణ్యత, సమర్థవంతమైన, పారదర్శక అంతర్గత ప్రక్రియలు, జంతు సంరక్షణ, పెంపకంలో అనుసరించే ప్రామాణిక విధానాలు, టికెటింగ్, సందర్శకుల సేవలు, అత్యవసర ప్రతిస్పందన, సిబ్బంది శిక్షణ, నైపుణ్యాభివృద్ధి ఇక్కడ ఉన్నాయని వివరించారు. ఏ జూకైనా ఐఎస్ఓ 14001 సర్టిఫికేషన్లు పొందడం ఒక పెద్ద విజయం అని చెప్పుకొచ్చారు. ఇది జూ పార్కు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పర్యావరణ నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని సూచిస్తుందన్నారు. ఐఎస్ఓ 14001: హైదరాబాద్ జూ అందుకున్న పర్యావరణ నిర్వహణ వ్యవస్థ వ్యర్థాల ఉత్పత్తిని పర్యవేక్షించడం, తగ్గించడం, శక్తి, నీటి వినియోగం, కార్బన్ పాదముద్ర, నివాస నిర్వహణ, కాలుష్య నియంత్రణ, బాధ్యతాయుతమైన వనరుల వినియోగం, పరిరక్షణ, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో జంతుప్రదర్శనశాల నిరంతర ప్రయత్నాలను సూచిస్తుందన్నారు.

# తిరుమలలో డిసెంబర్ 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు!

తిరుమల: తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వారా దర్శనాలు కల్పించనున్నట్లు తితిదే వెల్లడించింది. మొదటి మూడ్రోజులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా, ఆ తర్వాత ఏడు రోజులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2 ద్వారా సర్వదర్శనాలు ఉంటాయని పేర్కొంది. ఈ క్రమంలో తొలి మూడ్రోజులు ఎస్ఈడీ, శ్రీవాణి దర్శనాలు రద్దు చేయనున్నట్లు తెలిపింది. ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ దర్శనాలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. వైకుంఠ ద్వార దర్శన రోజులైన డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. మొదటి మూడు రోజుల వైకుంఠ ద్వారా దర్శనాలకు నవంబర్ 27న ఉదయం 10 గంటల నుండి డిసెంబర్ 1న సాయంత్రం 5 గంటల వరకు తితిదే వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in/, తితిదే యాప్, వాట్సాప్‌లో ఏపీ గవర్నమెంట్ బాట్‌లో తితిదే ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్



డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు వెల్లడిస్తారు.

# సాధ్యమైనంత త్వరగా అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు

**: మంత్రి పార్థసారధి**

అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు చేసే విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అమరావతి జర్నలిస్టు హౌసింగ్ ప్రాజెక్ట్ పై రాష్ట్ర సమాచార మరియు గృహనిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారథి సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై మంత్రి పార్థసారథి గారిని అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఇక్కడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మంగళవారంనాడు కలిశారు. జర్నలిస్టుల కోసం సీఆర్డీఏ ఆధ్వర్యంలో బహుళ అంతస్థుల గృహ సముదాయాన్ని నాలుగు కేటగిరీలలో నిర్మించే నిమిత్తం 30 ఎకరాల భూమిని మందడం, తుళ్లూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి 2019లో కేటాయించటం జరిగిందని వారు వివరించారు. దానిని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ సీఆర్డీఏ సంస్థనే డెవలపర్ గా దాని ఆధ్వర్యంలోనే ప్రాజెక్ట్ నిర్మించాలని సొసైటీ గతంలో ప్రభుత్వాన్ని కోరింది. ఇందు నిమిత్తమే సొసైటీకి కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వటం జరిగింది. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అంగీకరించిన నేపథ్యంలో ప్రభుత్వం జీవో నెంబర్ 107 ఇస్తూ హ్యాపీనెస్ట్ మోడల్ లో నిర్మిస్తామని పేర్కొంది. ఇప్పుడు ఆ ఉత్తర్వులు అమలు జరిగేలా చూడాలని కోరుతూ పార్థసారధి గారిని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో పాటు సీనియర్ జర్నలిస్టులు కోరడం జరిగింది. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను మరియు హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ గారు మరియు సీఆర్డీఏ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీనిని సాధ్యమైనంత త్వరగా అమలు జరిగేలా అవసరమైన వారితో సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మంత్రి సారధి గారు వెంటనే సమాచార శాఖ డైరెక్టర్ శ్రీ విశ్వనాధ్ గారికి ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా సమాచార శాఖ డైరెక్టర్ కూడా ఈ విషయంపై సత్వరమే సంప్రదింపులు జరుపుతామని ఆయనను కలిసిన జర్నలిస్టు సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రి గారిని కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు చావా రవి, టీవీ9 ఈశ్వర్, మహాటీవీ శ్రీనివాస్ మరియు సీనియర్ జర్నలిస్టులు ఆంధ్రప్రభ అడిషనల్ బ్యూరోచీఫ్ గోపీ, ఆంధ్రజ్యోతి సత్యనారాయణ, హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాధ్, ఎస్. మల్లిఖార్జున్, బి.నాగేశ్వరరావు ఉన్నారు.



## కాంగ్రెస్ అరాచకాలపై 'విద్యార్థి రణభేరి'

**: కేటీఆర్**

హైదరాబాద్: కాంగ్రెస్ అరాచకాలపై 'విద్యార్థి రణభేరి' మోగించాలని మాజీ మంత్రి, భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకుల సమస్యలపై త్వరలో పోరుబాట పడతామన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నేతలతో మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. వచ్చే నెల నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. సామాజిక మాధ్యమాల వేదికగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. "విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. బీసీ డిక్లరేషన్‌లోని హామీలు అమలయ్యే వరకు పోరాడాలి. రూ.5 లక్షల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు పాలసీ తీసుకొచ్చారు. ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకే భూములు ఇస్తున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు.



## భాజపా బలపరిచిన అభ్యర్థిని ఏకగ్రీవం చేస్తే రూ.10లక్షలు

**: బండి సంజయ్**

హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో కేంద్ర మంత్రి, భాజపా నేత బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాజపా బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా ఏకగ్రీవం చేస్తే రూ. 10లక్షలు ప్రోత్సాహకంగా నిధులు ఇస్తానని వెల్లడించారు. ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు డబ్బులిచ్చే అంశంలో తాను మాట తప్పనన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో పొరపాటు చేస్తే.. ఐదేళ్లు నరకయాతన అనుభవించాల్సి వస్తుందన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా తన వద్ద ఎంపీ లాడ్స్ నిధులు ఉన్నాయని, కేంద్రంతో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకొస్తానని బండి సంజయ్ చెప్పారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.5లక్షలు ఇస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలాంటి వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆ పార్టీల మాయలో పడొద్దని, భాజపా బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



## తాగునీటితో కారు క్లీనింగ్..
# హైదరాబాద్‌లో వ్యక్తికి రూ.10వేలు జరిమానా

హైదరాబాద్: జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన ఓ వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి ఎండీ అశోక్ రెడ్డి బంజారాహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా.. రోడ్డు నంబర్ 12లో ఓ వ్యక్తి తాగునీటితో కారును కడుగుతూ కనిపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జలమండలి ఎండీ.. తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించొద్దని హెచ్చరించారు. అంతేకాకుండా తాగునీటిని వృథా చేసిన సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చి జరిమానా విధించాలని సంబంధిత మేనేజర్‌ను ఆదేశించారు. దీంతో అధికారులు ఆ వ్యక్తికి రూ 10వేల జరిమానా విధించారు. తాగునీటితో కారును కడుగుతున్న ఫొటోతో పాటు జరిమానా విధించిన రసీదును సైతం జలమండలి అధికారులు 'ఎక్స్'లో పోస్టు చేశారు. జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



## జీహెచ్‌ఎంసీ విస్తరణకు
# తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

హైదరాబాద్: జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాకుండా మరో డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చించినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు.



*** క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు**

- >> 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలు
- >> పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానం
- >> కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి
- >> ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం
- >> పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన
- >> హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు
- >> భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీఫైబర్ కేబుళ్ల ఏర్పాటు
- >> భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపు
- >> ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు
- >> జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటు

## ఈ ప్రభుత్వం 20పైసలు ఇస్తూ 80 పైసలకు ఎగనామం పెడుతోంది

**: హరీశ్‌రావు**

సిద్దిపేట: కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండగకి 18 ఏళ్లు నిండిన 1.30కోట్ల మంది మహిళలకు చీరలు అందిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న 46లక్షల మందికే చీరలు ఇస్తున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటలో 3.83లక్షల మంది మహిళలుంటే 1.99లక్షల మందికే చీరలు ఇచ్చారని చెప్పారు. జిల్లా కలెక్టరేట్ లో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. "ఒక్క ఏడాదికి మాత్రమే చీర ఇచ్చి సారె పెట్టానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. చీర ఇచ్చాను సర్పంచ్ ఎన్నికల్లో మహిళలంతా ఓట్లు వేయండని చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500 సంగతి ఏమైంది? రెండు చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చిన మీకు మహిళలు ఎందుకు ఓటేయ్యాలి? పట్టణ ప్రాంతాల్లో ఎన్నికలు లేవు కాబట్టి చీరలు లేవు.. వడ్డీలేని రుణాలు లేవు. మహిళా సంఘాలు రూ.25వేల కోట్ల రుణాలు తీసుకుంటే రూ.5వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగనామం పెడుతోంది. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. గతంలో స్త్రీనిధి కింద వడ్డీలేని రుణాలు ఇచ్చాం. ఇప్పుడు ఇవ్వట్లేదు. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని మహిళా సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి రెండేళ్లు అయినా ఒక్క మెగావాట్ పవర్ కూడా పెట్టలేదు. కేసీఆర్ పండగ.. పండగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్‌రెడ్డి ఓట్ల ఓట్లకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారు"అని హరీశ్‌రావు విమర్శించారు.



## బబుల్‌హెడ్ డాల్ సిండ్రోమ్.. న్యూరో ఎండోస్కోపిక్ సర్జరీతో చిన్నారికి నూతన జీవితం

రెజిమెంటల్‌బజార్: అత్యంత అరుదుగా వచ్చే బబుల్ హెడ్ డాల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న రెండున్నరేళ్ల చిన్నారికి న్యూరో ఎండోస్కోపిక్ సర్జరీతో నూతన జీవితాన్ని అందించినట్లు సికింద్రాబాద్ మెడికవర్ వైద్య నిపుణులు వెల్లడించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ రమేష్ శిఘకొల్లి, వైద్యనిపుణులు భవానీశంకర్ శ్రీనివాస్, ప్రదీప్ ఈ వివరాలు వెల్లడించారు. "నగరంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన దంపతుల రెండున్నరేళ్ల కుమారుడు పుట్టుకతోనే హైడ్రోసెఫలస్ కారణంగా అరుదుగా కనిపించే బబుల్ హెడ్ డాల్ సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్నాడు. మెదడులో అనేక నీటి బుడగలు ఉండడంతో సాధారణ పిల్లల్లా స్పందించలేకపోవడంతో పాటు మానసిక స్థితి సరిగా ఉండట్లేదు. కొన్ని రోజుల కిందట చిన్నారి తల్లిదండ్రులు మా వద్దకు రాగా అతడిని పరీక్షించి మెదడులో అనేక నీటి బుడగలతో తీవ్రమైన ఒత్తిడి కారణంగానే ఈ సమస్య ఏర్పడినట్లు గుర్తించాం. బాలుడికి న్యూరో సర్జరీ బృందం న్యూరో నావిగేషన్‌తో కూడిన అధునాతన న్యూరో ఎండోస్కోపీ ద్వారా సర్జరీ చేసింది. దీర్ఘకాలిక నియంత్రణ కోసం వైద్యులు ప్రోగ్రామబుల్ వీపీ స్టంట్‌ను అమర్చారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో బాలుడు కోలుకుంటున్నాడు" అని వైద్యులు తెలిపారు.



## ఐ-బొమ్మ రవి ఓవర్‌కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఐ బొమ్మ కేసుకు సంబంధించి నిందితుడు ఇమంది రవి నుంచి కీలక వివరాలు రాబట్టినట్లు సైబర్‌క్రైమ్ అడిషనల్ సీపీ శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌ను రవి మరో కంపెనీ నుంచి హోస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. డొమైన్‌ను 'ఎన్‌జల' కంపెనీలో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఐబొమ్మ వెబ్‌సైట్ వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వెల్లడించారు. కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రవి సినిమాలు పోస్ట్ చేసినట్లు ప్రకటించారు. "ఐ బొమ్మ, బప్పం వెబ్‌సైట్ల ద్వారా రవి సినిమాలు పోస్ట్ చేసేవాడు. ఆయా వెబ్‌సాఫ్ట్‌వేర్‌లో రీడైరెక్ట్ స్క్రిప్ట్ రాశాడు. తద్వారా గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లకు వెళ్తుంది. ఇప్పటికీ మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పలు పైరసీ వెబ్‌సైట్లు ఇప్పటికీ నడుస్తున్నాయి. ఆయా వెబ్‌సైట్ల నిర్వాహకులను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దాని పేరును చాలా మంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు ఆ వెబ్‌సైట్ పేరు వాడుకుంటున్నారు. ఇమంది రవి రూ.20 కోట్ల వరకు సంపాదించినట్లు తెలిసింది. భవిష్యత్‌లో వెబ్3 టెక్నాలజీ రాబోతోంది. దాని ద్వారా పైరసీ చేస్తే.. పట్టుకోవడం చాలా కష్టం. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. రవి భార్య మాకు సమాచారం ఇచ్చిందన్న వార్తలు అవాస్తవం. ఆయన భార్యను మేం విచారించలేదు. పైరసీ వ్యవహారం దర్యాప్తు చాలా సంక్లిష్టతతో కూడిన వ్యవహారం. ఐ బొమ్మ రవి ఒంటరి.. వారానికో దేశం తిరిగేవాడు. ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. లక్ష డాలర్లు వెచ్చించి కరేబియన్ దీవుల పౌరసత్వం కొన్నాడు. రవి వెబ్‌సైట్లకు నిఖిల్ అనే మరోవ్యక్తి పోస్టర్లు డిజైన్ చేసేవాడు. మన చట్టాల ప్రకారం ఇక్కడ విదేశీయులు నేరం చేసివుంటే.. అది నేరమే. నేరగాళ్ల అప్పగింతపై మనకు పలుదేశాలతో సంబంధాలున్నాయి" అని శ్రీనివాస్ మీడియాకు తెలిపారు.



## సీపీఎం ఆందోళన.. ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

ఖమ్మం: సీపీఎం సీనియర్ నేత సామినేని రామారావు హత్యకు నిరసనగా ఆ పార్టీ నేతలు జిల్లా కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఆందోళనలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు.

# రైలు చూసేందుకు బాగుంది.. కానీ..: వందేభారత్ 'రూపకర్త' కీలక వ్యాఖ్యలు

భారతతొలి సెమీ హైస్పీడ్‌రైలు 'వందేభారత్' రూపకల్పనలో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) మాజీ జీఎం సుధాంశు మణిది కీలక పాత్ర. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రైళ్లు 2019లో పట్టాలెక్కాయి. ఇది జరిగిన ఏడేళ్ల తర్వాత ఓ ప్రయాణికుడిగా ఆయన ఇందులో తొలిసారి ప్రయాణించారు. లఖ్‌నవూలోని చార్‌బాగ్ స్టేషన్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు వెళ్లిన ఆయన.. తనకు మిశ్రమ ప్రయాణ అనుభవం ఎదురైనట్లు తెలిపారు. ఈ రైలు బయటినుంచి చూడటానికి బాగుందన్నారు. అయితే.. ప్రయాణికులు కొంతమందే ఉన్నారని తెలిపారు. అదే విధంగా కోచ్ ఫ్లోర్‌పై రెడ్ కార్పెట్ అనవసరమన్నారు. "రైలు వెలుపలి భాగం మేం నిర్మించిన దానిలాగే కనిపించింది. చాలా రైళ్ల కన్నా మెరుగ్గా ఉంది. ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ శుభ్రంగా ఉంది. ఇంటీరియర్ బాగుంది. పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారు. రెడ్ కార్పెట్‌ను అనవసరంగా పర్చారు. సీట్లు ప్రోటోటైప్ కన్నా సౌకర్యవంతంగా ఉన్నాయి. టాయిలెట్ చక్కగా పనిచేస్తోంది. అయితే.. అందులోని కుళాయిల వంటి సామగ్రి నాణ్యత అంతంతమాత్రమే! ప్రయాణం సౌకర్యంగా ఉంది. అయితే, ప్రొటోటైప్‌తో పోలిస్తే మెరుగుపడలేదు. 'యాక్సిలరేషన్' ఇప్పటికీ అద్భుతంగా ఉంది. ఇదే రైలు అతిపెద్ద బలం. ఎగ్జిక్యూటివ్ క్లాస్ ఆక్యుపెన్సీ 25 శాతం కన్నా తక్కువ ఉంది. చైర్‌కార్ దాదాపు సగం సామర్థ్యంతోనే నడుస్తోంది. ఈ పరిస్థితిని మేం చాలా కాలం క్రితమే ఊహించాం. స్లీపర్



వేరియంట్ లేకుండా.. డే ట్రైన్ మోడల్‌లో ఈ ఇబ్బందులు తప్పవని తెలుసు. వీలైనంత త్వరగా స్లీపర్ వందేభారత్‌ను తీసుకురావాలి" అని ఓ బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొన్నారు. వందేభారత్‌లను ప్రవేశపెట్టిన ఏడేళ్ల తర్వాత ఇందులో తొలిసారి ప్రయాణించడంపై స్పందిస్తూ.. తన ప్రయాణం ప్రణాళికాబద్ధంగా కాకుండా సహజంగా అలా జరిగిపోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తాను తరచూ వెళ్లే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి వంటి నగరాలకు లఖ్‌నవూ నుంచి రైలు ప్రయాణం అంత మంచి ఎంపిక కాదన్నారు. వందేభారత్ స్లీపర్ వెర్షన్‌ను తీసుకురావడంలో జాప్యంపై రైల్వేశాఖను విమర్శించారు. దీని గరిష్ఠ వేగం కన్నా తక్కువ స్పీడ్‌లో నడపడంపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. సుధాంశు మణి చెన్నైలోని ఐసీఎఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. రైల్వేలో 38 ఏళ్లు పనిచేసి, 2018 డిసెంబరులో పదవీ విరమణ చేశారు. 2018లో 'ట్రైన్ 18' పేరిట రూపొందించిన వందేభారత్ ప్రొటోటైప్ రైలు టెస్ట్ రన్ సమయంలో ప్రయాణించారు.

## నోటి క్యాన్సర్‌ను గుర్తించేలా..
# 3డీ యాప్ రూపకల్పన!

ఉజ్జయిని: భారత్‌లో నోటి క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి సంకేతాలను ప్రాథమికంగా గుర్తించేలా, ప్రజల్లో అవగాహన పెంచేలా మధ్యప్రదేశ్‌కు చెందిన దంత నిపుణులు డా.ఇమిత్ పాల్ సలూజా ఓ యాప్‌ను రూపొందిస్తున్నారు. 'ఓరల్ క్యాన్సర్ ఇంటరాక్టివ్ 3డీ యాప్' పేరిట తీసుకురానున్న ఈ అప్లికేషన్.. ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), ఇంటరాక్టివ్ 3డీ చిత్రాల



సాయంతో పనిచేస్తుంది. ఎవరైనా తమ నోటి ఫొటో తీసుకుని.. యాప్‌లోని 3డీ క్లినికల్ చిత్రాలతో పోల్చుకోవచ్చు. "నోటిపూత, మచ్చలు, వాపు వంటి నోటి క్యాన్సర్ ప్రారంభ సంకేతాలను గుర్తించడంలో ఈ యాప్ సాయపడుతుంది. చికిత్సకు సంబంధించిన సలహాలు అందజేస్తుంది. ఇందులో రోగుల కథనాలనూ అందుబాటులో ఉంచనున్నాం. దీన్ని అన్ని భారతీయ భాషల్లో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 16 ఏళ్ల పిల్లల్లోనూ నోటి క్యాన్సర్ కేసులు వెలుగుచూస్తున్నాయి. అనేక మంది వీధి బాలలు పొగాకుకు అలవాటు పడుతున్నారు. ఈ యాప్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం" అని సలూజా చెప్పారు.

## బూడిద మేఘాలపై ఆందోళన అక్కర్లేదు
# పౌరవిమానయాన శాఖ

ఆఫ్రికాలోని ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం పేలడంతో.. దాని తాలుకు బూడిద మేఘాలు భారత్ వైపు కదిలి వచ్చాయి. ఈ నేపథ్యంలో విమాన సర్వీసులతోపాటు ఆయా రాష్ట్రాలపై ఇవి ప్రభావం చూపే అవకాశం ఉందనే కథనాలు వచ్చాయి. దీనిపై పౌరవిమానయానశాఖ స్పందించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నట్లు వెల్లడించింది. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని విమానాలను దారిమళ్లించినట్లు తెలిపింది. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. "ఈ వ్యవహారంపై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, భారత వాతావరణ విభాగం, విమానయాన సంస్థలు, అంతర్జాతీయ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటున్నాం. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఇప్పటికే నోటమ్ జారీ చేసింది. ప్రభావిత విమానాలకు ఈమేరకు సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా విమాన కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన అక్కర్లేదు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ప్రయాణికుల భద్రత కోసం ఎప్పటికప్పుడు



అప్‌డేట్స్ అందిస్తాం" అని పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఇథియోపియాలో హేలీ గుబ్బి అగ్నిపర్వతం విస్ఫోటంతో ఏర్పడిన ఈ బూడిద మేఘాలు నింగిలో వేల అడుగుల ఎత్తులోకి చేరాయి. ఎర్రసముద్రం మీదుగా అరేబియా ద్వీపకల్పం చేరుకొని అక్కడినుంచి భారత ఉపఖండం దిశగా పయనించాయి. గుజరాత్, దిల్లీఎన్‌సీఆర్, రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు విస్తరించాయి. ఇవి మంగళవారం రాత్రి 7.30 నాటికి భారత గగనతలం దాటిపోయే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. అవి చైనా దిశగా కదులుతున్నట్లు తెలిపారు.

## ఇంకెంతకాలం..
# ఏదో ఒక నిర్ణయం తీసుకోండి

* **అధిష్ఠానానికి సిద్ధూ సూచన**

కర్ణాటక కొంతకాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. నవంబర్‌లో ఆ మార్పు ఉండొచ్చన్న వార్తలు.. ఈ నెల ముగింపునకు వచ్చినా ఆగడం లేదు. ఎడతెగకుండా వస్తోన్న ఊహాగానాలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి స్పందించారు. ఆ వార్తలకు శుభం కార్డు వేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. ఐదేళ్లూ సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఒకవైపు డీకే చెప్తున్నా.. మరోవైపు సీఎం పదవిపై ఆశను పరోక్షంగా వ్యక్తంచేస్తున్నారు. కర్ణాటక రాజకీయాల్లో మరికొన్ని రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయని ఇంకోవైపు విపక్ష నేతలు జోస్యం చెప్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా



తీవ్ర గందరగోళంలో ఉంది. మరికొన్ని నెలల్లో అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీయవచ్చు" అని కేంద్ర మంత్రి కుమారస్వామి వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిద్ధూ స్పందన వచ్చింది.

**అప్పుడు డీకేనే ఛాయిస్...**

సీఎం మార్పు చేపడితే రాష్ట్రంలో పార్టీ భవిష్యత్ ఎలా ఉంటుందనే దానిపై కాంగ్రెస్ సమాలోచనలు చేస్తోంది. ఒకవేళ సిద్ధరామయ్యను మారిస్తే.. ఆ స్థానంలోకి వచ్చేందుకు డీకే శివకుమార్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మూడో వ్యక్తికి ఆ పదవి దక్కే ఛాన్స్ చాలా తక్కువ అని పేర్కొన్నాయి. ప్రస్తుతం సిద్ధూ, డీకే పేర్ల చుట్టూనే చర్చ నడుస్తోందని తెలిపాయి.

## శాంతిని కాంక్షిస్తాం..
# కానీ, భద్రతపై రాజీపడం: ప్రధాని మోదీ

తమ ప్రభుత్వం శాంతిని కాంక్షిస్తోందని, కానీ.. దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఆపరేషన్ సిందూర్ దీనికి అతిపెద్ద ఉదాహరణ అని పేర్కొన్నారు. సిక్కు గురువు గురు తేగ్ బహదూర్ 350వ బలిదాన దినం సందర్భంగా హరియాణాలోని కురుక్షేత్రలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేరిట ప్రత్యేక నాణెం, స్మారక స్టాంపును ప్రధాని మోదీ విడుదల చేశారు. సత్యం, న్యాయం, విశ్వాసాల పరిరక్షణను తన ధర్మంగా భావించి దానికోసం గురు తేగ్ బహదూర్ జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. "ఈరోజు ఉదయం రామాయణ నగరం (అయోధ్య)లో ఉన్నాను. ఇప్పుడు కృష్ణుడి నేల (కురుక్షేత్ర)పై ఉన్నాను. రామమందిరంపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజు కర్తార్‌పుర్ కారిడార్ ప్రారంభోత్సవం కోసం పంజాబ్‌లోని డేరా బాబా నానక్‌కు వెళ్లాను. ఆలయ నిర్మాణానికి మార్గం సుగమం కావాలని, రామభక్తులందరి ఆకాంక్షలు నెరవేరాలని ప్రార్థించాను. ఆ రోజు రామ మందిరానికి అనుకూలంగా



తీర్పు వచ్చింది" అని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. నేడు మళ్లీ తనకు 'సిక్కు సంగత్' నుంచి ఆశీర్వాదాలు పొందే అవకాశం లభించిందన్నారు. అంతకుముందు జ్యోతిసర్‌లో కృష్ణుడి శంఖానికి గుర్తుగా కొత్తగా నిర్మించిన 'పాంచజన్య' స్మారకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. సత్యాన్ని, న్యాయాన్ని రక్షించడమే గొప్ప ధర్మమని శ్రీకృష్ణ భగవానుడు ఇదే కురుక్షేత్ర భూమిపై చెప్పారన్నారు. అనంతరం మహాభారతంలోని ముఖ్యమైన ఘట్టాలను వర్ణించే 'మహాభారత అనుభవ కేంద్రాన్ని' సందర్శించారు. అంతర్జాతీయ గీతా మహోత్సవంలో భాగంగా బ్రహ్మసరోవరంలో నిర్వహించిన 'మహా హారతి'లో పాల్గొన్నారు.

# బీఎల్‌ఓ మరణాల కలవరం.. ఎన్నికల సంఘం అప్రమత్తం

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న కొన్ని రాష్ట్రాల్లో బూత్ స్థాయి (BLO) అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పనిఒత్తిడి కారణంగా బీఎల్‌ఓలు అనారోగ్యానికి గురవడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కలవరం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. తాజా పరిణామాలకు సంబంధించి ఆయా రాష్ట్రాల సీఈఓ (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్)ల నుంచి నివేదిక కోరినట్లు తెలిసింది. "బీఎల్‌ఓల అంశంపై సీఈఓలు దృష్టి సారించారు. తాజా పరిణామాలపై సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల (డీఈఓ) నుంచి నివేదికలు కోరుతున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తైన తర్వాత ఎన్నికల సంఘానికి పూర్తి నివేదిక అందిస్తారు. ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం" అని ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా



బీఎల్‌ఓలకు అవసరమైన పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 5.32లక్షల మంది బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో బీఎల్‌ఓలు తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ సహా పలు విపక్ష పార్టీల నేతలు ఈసీ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. బూత్ స్థాయి అధికారులపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, అందుకే అనారోగ్యం బారినపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

# సవాల్ విసరాలని చూస్తే.. భాజపా పునాదులు కదిలిస్తా

**: మమతా బెనర్జీ**

భాజపా తనతో రాజకీయంగా పోరాడలేదని, తనను ఓడించడం సాధ్యం కాదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ పునాదులను కదిలిస్తానని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'కు వ్యతిరేకంగా బన్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీలో ఈ మేరకు ప్రసంగించారు. ఎన్నికల సంఘం ఏ మాత్రం నిష్పాక్షికంగా పనిచేయడం లేదని, అది భాజపా కమిషన్‌గా మారిందని ఆరోపించారు. ఎస్ఐఆర్ కారణంగానే బిహార్ ఎన్నికల ఫలితాలు ఆ విధంగా వచ్చాయని, అక్కడ భాజపా ఆటను ప్రతిపక్షాలు అంచనా వేయలేకపోయాయని దీదీ తెలిపారు. ఒకవేళ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమైతే.. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. అంటే.. 'డబుల్ ఇంజిన్' సర్కారు రాష్ట్రాల్లో చొరబాటుదారులు ఉన్నట్లు ఆ పార్టీ అంగీకరిస్తోందా? అని అన్నారు.



రాష్ట్రంలో మతువా మెజారిటీ ప్రాంతాల్లోని ఓటర్లు 'సీఏఏ' కింద తమను తాము విదేశీయులుగా ప్రకటించుకుంటే వెంటనే ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగిపోతాయన్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా బయటకు వచ్చిన తర్వాత.. ఈసీ, భాజపా సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే సహకరిస్తామని చెప్పారు.

**హెలికాప్టర్ రద్దు.. మండిపడిన దీదీ**

తొలుత హెలికాప్టర్ ద్వారా బన్‌గావ్‌కు చేరుకునేందుకు దీదీ సిద్ధం కాగా.. ఆ ప్రణాళిక రద్దయింది. దీంతో కోల్‌కతా నుంచి ఆమె రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. చివరి క్షణంలో హెలికాప్టర్ ప్రయాణం రద్దు కావడం వెనుక భాజపా హస్తం ఉందని ఆమె ఆరోపించారు. ఆ పార్టీ తనను ఇరుకున పెట్టలేదని, తనతో ఆటలాడొద్దని హెచ్చరించారు. అయితే.. గడువు ముగిసిన లైసెన్స్‌తో ఆ హెలికాప్టర్‌ను నడుపుతున్నట్లు గుర్తించామని, దీంతో రద్దు చేయాల్సి వచ్చిందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

**ఈసీతో భేటీ కానున్న టీఎంసీ ప్రతినిధులు**

పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న వేళ.. తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు ఎన్నికల సంఘంతో భేటీ కానున్నారు. అపాయింట్‌మెంట్ కోరుతూ పార్టీ నేత డెరెక్ ఓబ్రియన్ చేసిన విజ్ఞప్తికి ఈసీ స్పందించింది. ఈ నెల 28న ఓ అధికార ప్రతినిధి, మరో నలుగురితో కూడిన బృందం తమను కలవొచ్చని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి ఓ లేఖ రాసింది. పార్టీలతో నిర్మాణాత్మక చర్చలను తాము ఎల్లప్పుడూ స్వాగతిస్తామని పేర్కొంది.

# దిల్లీ పేలుడు.. ఆ ఉగ్రవాదిని హతమార్చినందుకు ప్రతీకారమేనా?

దిల్లీ కారు బాంబు పేలుడు కేసులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. విచారణలో అరెస్టయిన ఉగ్రవాదుల నుంచి దర్యాప్తు అధికారులు కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆత్మాహుతి చేసుకున్న ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ.. 2016లో భద్రతా బలగాల చేతిలో మృతిచెందిన బుర్హాన్ వానీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని చూశాడని తేలింది. ముఖ్యంగా ఈ ముఠాలో అతడి పాత్ర, ప్రణాళికలు, ఉగ్రవాదిగా మార్చిన కారణాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. హరియాణాలోని ఫరీదాబాద్‌లో పట్టుబడ్డ ఈ 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్'కు చెందిన పలువురు నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు కీలకమైన సమాచారాన్ని రాబట్టారు. ఈ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులకు తాను నాయకుడినని చెప్పడానికి ఉమర్ తరచూ తనను తాను 'ఎమిర్' అని పిలుచుకునేవాడని తేలింది. ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా యూనివర్సిటీ డాక్టర్ ముజమ్మిల్ షకీల్ ఈ సూసైడ్ బాంబర్ గురించి అధికారులకు చెప్పినట్లు సమాచారం. జైషే మహమ్మద్ ప్రధాన కాంటాక్ట్ మౌల్వి ఇర్ఫాన్ అహ్మద్ ద్వారా ఉగ్రవాద మాడ్యూల్‌లో మొదట చేరింది షకీల్ అని తేలింది. ఉమర్ హోదా, అనుభవంతో పోలిస్తే తాను కేవలం ఒక 'సాధారణ కూలీ'నని అతడు చెప్పినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

## అమ్మకాల ఒత్తిడి.. వరుసగా మూడో సెషన్‌లో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. ఐటీ, మీడియా, చమురు రంగాల సూచీలు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 85,008.93 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. పొద్దంతా లాభాల్లో మార్కెట్లు కొనసాగగా.. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో ఒక దశలో 85,110.24 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 84,536.73 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. సెన్సెక్స్ చివరకు 313.70 పాయింట్లు తగ్గి.. 84,587.01 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74.70 పాయింట్లు పతనమై.. 25,884.80 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ సూచీలు కీలక సూచీల కంటే మెరుగైన పనితీరును కనబరిచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప లాభంతో ముగిశాయి. హిందాల్కో ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ, భారత్ ఎలక్ట్రానిక్స్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి.

అదానీ ఎంటర్‌ప్రైజెస్, టీఎంవీపీ, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ట్రెంట్ నష్టపోయాయి. మెటల్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. అయితే కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, మీడియా, ఆయిల్, గ్యాస్ 0.5శాతం చొప్పున తగ్గాయి. సీఈవో రాజీనామా తర్వాత యాత్రా ఆన్‌లైన్ షేర్లు ఒకశాతం పడిపోయాయి. బైట్ ఎక్లిప్స్ టెక్నాలజీస్ ఇంక్‌తో జేవీలో బ్లూ క్లౌడ్ స్టాఫ్ట్ టెక్ షేర్లు 3శాతం తగ్గాయి. 1.26శాతం ఈక్విటీ బ్లాక్ డీల్‌పై రియలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేర్లు 4శాతం తగ్గాయి. బ్లాక్ డీల్ తర్వాత అశోక్ లేలాండ్ షేర్లు ఒకశాతం పెరిగాయి. రూ.389.97 కోట్ల ఆర్డర్‌తో ట్రాన్స్‌ఫార్మర్స్, రెక్టిఫైయర్స్ షేర్ ధర 4శాతం పెరిగింది. రూ.220 కోట్ల ఆర్డర్ కారణంగా నీరజ్ సిమెంట్ షేర్ ధర దాదాపు 9శాతం వృద్ధి చెందింది. ఫెడరల్ బ్యాంక్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్ వంటి దాదాపు 80 స్టాక్‌లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

## అమెరికా సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి..!



**న్యూఢిల్లీ:** రష్యా నుంచి చమురు కొనుగోలుకు నిరసనగా విధించిన అదనపు సుంకాలను తొలగించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ పేర్కొంది. ఈ సుంకాలను ఎత్తివేస్తే భారతీయ వస్తువులపై అమెరికా విధించిన సుంకాల భారం 50శాతం నుంచి 25శాతానికి తగ్గనున్నది. ఇది వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా వంటి రంగాలకు గణనీయమైన ఉపశమనం కలిగించనున్నది. ఆయారంగాలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వంతో జరగనున్న సమావేశంలో రెండు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జీటీఆర్ఐ వాణిజ్య బోర్డుని కోరింది. మంగళవారం ప్రభుత్వంతో జరిగే బీవోటీ సమావేశానికి వాణిజ్యం, పరిశ్రమల మంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఎగుమతి వృద్ధిని పెంచే చర్యలను సమావేశంలో సిఫారసు చేయనున్నారు.

భారతదేశ ఎగుమతి పోటీతత్వాన్ని పునరుద్ధరించడం, యూఎస్‌తో భవిష్యత్తులో జరిగే చర్చల్లో భారతదేశాన్ని సమాన స్థాయిలో ఉంచేందుకు సుంకాల తగ్గింపు అవసరమని నివేదిక పేర్కొంది. భారతదేశం మంజూరు చేయబడిన రష్యన్ కంపెనీల నుంచి చమురు కొనుగోలును ఎక్కువగా నిలిపివేసిందని అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా అంగీకరించారని జీటీఆర్ఐ గుర్తు చేసింది. దాని ఆధారంగా సర్‌ఛార్జ్ విధించబడింది. ఎగుమతి ప్రమోషన్ మిషన్ ప్రస్తుతం ఒక ఫ్రేమ్‌వర్క్‌కే పరిమితం అని జీటీఆర్ఐ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించబడింది. నవంబర్ 12న కేబినెట్ ఆమోదించింది. ఈ మిషన్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఎనిమిది నెలల వరకు ఇంకా కార్యాచరణ ప్రణాళిక లేదని, ఎగుమతి వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ ప్రణాళికలను వెంటనే అమలు చేయడం చాలా అవసరమని నివేదిక పేర్కొంది.

## యాపిల్ సేల్స్ విభాగంలో ఉద్యోగాల కోత..!



**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా టెక్ సంస్థలు వరుసగా ఉద్యోగుల తొలగింపులను కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు విడతలవారీగా లేఆఫ్స్ ప్రకటించిన విషయం తె లిసిందే. ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఉద్యోగులను తొలగించాయి. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ టెక్ కంపెనీ యాపిల్ కూడా వచ్చి చేరింది.

ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం.. యాపిల్ తన సేల్స్ విభాగంలో ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. అయితే, స్వల్ప సంఖ్యలో ఉద్యోగులపై మాత్రమే ఈ లేఆఫ్స్ ప్రభావం ఉండనుంది. అంతేకాదు, ఇతర విభాగాల్లో నియామకాలు కొనసాగనున్నాయి. తాజా లేఆఫ్స్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారు ఇతర విభాగాల్లో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ మేరకు యాపిల్ వర్గాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

# భారత ఓపెనర్లు మళ్లీ విఫలం..

### ఆఖరి రోజు అద్భుతం జరిగేనా..?

**గువాహటి:** గువాహటి టెస్టులో సమిష్టి వైఫల్యంతో భారత జట్టు భారీ మూల్యం చెల్లించుకునేలా ఉంది. విజయంపై ఆశలు ఆవిరైన వేళ.. కనీసం డ్రా కూడా అసాధ్యం అనిపిస్తోంది. మన బ్యాటర్లు కుప్పకూలిన చోట.. దక్షిణాఫ్రికా భారీ స్కోర్ చేసి మ్యాచ్‌పై పట్టుబిగించింది. రెండో ఇన్నింగ్స్‌లోనైనా బాధ్యతగా ఆడాల్సిన ఓపెనర్లు 21 పరుగులకే పెవిలియన్ చేరారు. దాంతో.. నాలుగో రోజు ఆట ముగిసే సరికి టీమిండియా27 పరుగులు చేసింది. ఇంకా విజయానికి 522 పరుగులు కావాలి. ఎనిమిది వికెట్లు ఉన్నా.. సిరీస్ సమం చేయాలంటే సఫారీ బౌలర్లను కాచుకొని రోజంతా నిలబడడం గగనమే.

సిరీస్‌లో వెనకబడిన భారత జట్టు గువాహటిలోనూ అదే తడబాటు కొనసాగిస్తోంది. మ్యాచ్‌పై పట్టు సాధించే అవకాశాల్ని సృష్టించుకోలేకపోయింది. నాలుగో రోజు దక్షిణాఫ్రికా బ్యాటర్లకు కళ్లెం వేయలేక భారీ స్కోర్ సమర్పించుకుంది. సఫారీ టీమ్ రెండో ఇన్నింగ్స్‌ను 260/5 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం 549 లక్ష్యంతో ఇన్నింగ్స్ ఆరంభించిన టీమిండియాకు మార్కో జాన్సెన్ షాకిస్తూ.. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(13)ను పెవిలియన్ పంపాడు.





కాసేపటికే నాలుగు పరుగుల తేడాతో కేఎల్ రాహుల్(6)ను హార్మర్‌ను బౌల్డ్ చేశాడు. అనంతరం.. నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్(4 నాటౌట్).. సాయి సుదర్శన్ (2 నాటౌట్) వికెట్ కాచుకున్నారు. దాంతో, నాలుగో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. సిరీస్ సమం చేయాలంటే ఐదో రోజు మిడిలార్డర్ బ్యాటర్లు గొప్పగా పోరాడాల్సి ఉంది. అలా కాదని మళ్లీ చేతులెత్తేశారంటే సఫారీ జట్టు క్లీన్‌స్వీప్ చేయడం పక్కా.

### స్టబ్స్, జోర్జి దూకడు

తొలి రెండు రోజు నుంచి ఆధిపత్యం చెలాయించిన దక్షిణాఫ్రికా గువాహటి టెస్టులో డ్రైవింగ్ సీట్లో ఉంది. రోడ్డులాంటి ట్రాక్ మీద భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోవడంతో ట్రిస్టన్ స్టబ్స్(94), టోనీ డీజోర్జి(49)లు సఫారీలకు భారీ ఆధిక్యం అందించారు. మార్కో జాన్సెన్(6-48) చెలరేగడంతో టీమిండియాను 201కే ఆలౌట్ చేసిన.. పర్యాటక జట్టు నాలుగో రోజూ అదరగొట్టింది. ఓవర్ నైట్ స్కోర్‌తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా ఓపెనర్లను తొలి సెషన్లోనే రవీంద్ర జడేజా ఔట్ చేసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ తెంబా బవుమా(3)ను సుందర్ వెనక్కి పంపాడు. దాంతో.. ప్రత్యర్థిని రెండో సెషన్‌లోపే చుట్టేస్తారనిపించింది.

కానీ.. ట్రిస్టన్ స్టబ్స్(94), డిజోర్జి(49)లు క్రీజులో పతనాన్ని అడ్డుకొని స్కోర్‌బోర్డును ఉరికించారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో సఫారీల ఆధిక్యాన్ని 450 దాటించారు. రెండో సెషన్ తర్వాత దూకుడు పెంచిన స్టబ్స్ సెంచరీ కోసం యత్నించి జడ్డూ ఓవర్లో బౌల్డయ్యాడు. 260 వద్ద అతడి వికెట్ పడిన వెంటనే బవుమా ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు.

## ఫిబ్రవరి 15న దాయాదుల పోరు..

### మార్చి 8న ఫైనల్.. ప్రపంచకప్ పూర్తి షెడ్యూల్ ఇదే..!




**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పురుషుల పొట్టి ప్రపంచకప్ పూర్తి షెడ్యూల్ వచ్చేసింది. ఇప్పటికే ఇరుదేశాల్లో వేదికలు ఖరారు చేసిన అంతర్జాతీయ క్రికెట్ మండలి మంగళవారం మ్యాచ్ వివరాలను వెల్లడించింది. ఫిబ్రవరి 7 నుంచి టోర్నీ షురూ కానుండగా.. అదే రోజు రాత్రి 7 గంటలకు ముంబైలో భారత్, అమెరికా తలపడనున్నాయి. పొట్టి ప్రపంచకప్ తొలిపోరు కో-హోస్ట్ శ్రీలంకలోని కొలంబోలో జరుగనుంది. ఆరంభ మ్యాచ్‌లో పాకిస్థాన్, నెదర్లాండ్స్ ఢీకొంటాయి. ఆరోజు సాయంత్రం 7 గంటలకు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ముంబై వేదికగా పసికూన అమెరికాతో తలపడనుంది. సెమఫైనల్స్‌కు ముంబై, కోల్‌కతా వేదిక కానున్నాయి. అహ్మదాబాద్‌లో మార్చి 8న ఫైనల్ నిర్వహిస్తారు. దాయాదులు టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 15 శ్రీలంకలో జరుగునుంది. ఒకవేళ పాక్ ఫైనల్ చేరితే అహ్మదాబాద్ బదులు కొలంబోలోనే టైటిల్ పోరు నిర్వహిస్తారు. ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించిన 20 జట్లను గ్రూప్‌లుగా విభించింది ఐసీసీ. ఒక్కదాంట్లో ఐదు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య దేశమైన టీమిండియా గ్రూప్‌లో పాకిస్థాన్ మాత్రమే పెద్ద జట్టు. కానీ, శ్రీలంక గ్రూప్‌లో ఆస్ట్రేలియా ఉండడంతో ఆ జట్టుకు కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఇక గ్రూప్ 3లో ఇంగ్లండ్, వెస్టిండీస్.. గ్రూప్ 4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి టెస్టు క్రికెట్ ఆడే జట్లు ఉన్నాయి.

## కర్నాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా మాజీ పేసర్..

### ఎన్నికలకు ముందే పదవి ఖరారు..!

**బెంగళూరు:** కర్నాటక క్రికెట్ సంఘం తదుపరి అధ్యక్షుడిగా భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ ఖరారైనట్టే. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 7న జరగాల్సిన ఎన్నికలకు ముందే ప్రసాద్ విజయం ఖాయమైంది. ఎందుకుంటే.. ఇతరుల నామినేషన్లను తిరస్కరించారు. ప్రస్తుతం బరిలో ప్రసాద్ ఒక్కరే ఉన్నారు. దాంతో.. స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే బలపరిచిన ఆయన ఏకగ్రీవంగా ఎంపికవ్వడం లాంఛనమే అనిపిస్తోంది. గతంలో ప్రసాద్ 2010 నుంచి 2013 వరకూ కేఎస్‌సీఏ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.

ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం నవంబర్ 30న కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్నికలు జరగాలి. కానీ, ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్.బి. బసవరాజు (మాజీ ఐఏఎస్) క్రికెట్ సంఘం నిర్వహణ కమిటీ నుంచి స్పష్టత లేదని.. వెంటనే కోర్టు జోక్యం చేసుకోవాలని పట్టుపట్టారు. శుక్రవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరజ్ గోవిందరాజు డిసెంబర్ 7న ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే.. అధ్యక్ష పదవి కోసం గేమ్ ఛేంజర్స్ టీమ్ నుంచి వెంకటేశ్ ప్రసాద్, టీమ్ బ్రిజేశ్ నుంచి కే.ఎన్. శాంత్ కుమార్, కల్పన వెంకటాచార్ నామినేషన్ వేశారు. కానీ, సాంకేతిక కారణాలతో శాంత్ దరఖాస్తును ఎన్నికల అధికారి తిరస్కరించారు. వెంకటాచార్ తన నామినేషన్ వెనక్కి తీసుకున్నారు.



కర్నాటక క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న రఘురామ్ భట్ నేతృత్వంలోని సభ్యుల పదవీకాలం సెప్టెంబర్ 30న ముగిసిందిది. కొత్త టీమ్ కోసం నవంబర్ 30న ఎన్నికలు జరుగనున్నాయి. మసకబారిన కేఎస్‌సీఏకు పూర్వ వైభవం తేస్తానంటున్న మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ వెటరన్ ప్లేయర్‌కు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే మద్దతుగా నిలుస్తున్నాడు. దాంతో.. ఎన్నికల్లో విజయంపై దీమాగా ఉన్నాడు వెంకటేశ్ ప్రసాద్. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే చిన్నస్వామి స్టేడియం చిక్కుల్లో పడిందంటున్న వెంకటేశ్ ప్రసాద్ తాము పగ్గాలు చేపడితే సుపరిపాలన అందిస్తుందని హామీ ఇస్తున్నాడు.

టీమిండియా తొలితరం పేసర్లలో ఒకడైన ఆయన చిన్నస్వామి ఇమేజ్ పెంచుతానని మాట ఇస్తున్నాడు. గతంలో (2013-16) నాలుగేళ్ల పాటు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన వెంకటేశ్ ప్రసాద్ ఈసారి కేసీఏ చీఫ్‌గా సుపరిపాలన, పారదర్శకత అందించాలని భావిస్తున్నాడు.

## విశ్వ విజేతకు అరుదైన గౌరవం..

# వరల్డ్ కప్ ప్రచారకర్తగా రోహిత్

**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం లభించింది. నిరుడు టీమిండియాకు పొట్టి వరల్డ్ కప్ అందించిన హిట్‌మ్యాన్‌ను ఐసీసీ అంబాసిడర్‌గా నియమించింది. మంగళవారం టీ20 వరల్డ్ కప్ పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ.. ఈ టోర్నీకి రోహిత్‌ను ప్రచారకర్తగా ఎంపిక చేసింది. ఈ విషయాన్ని ఐసీసీ ఛైర్మన్ జై షా అధికారికంగా ప్రకటించారు. దాంతో.. వచ్చే ఏడాది స్వదేశంలో, శ్రీలంక వేదికగా జరుగబోయే ఈ మెగా ఈవెంట్ ప్రమోషన్స్‌లో రోహిత్ పాల్గొననున్నాడు.

'భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 వరల్డ్ కప్ పోటీలకు ప్రచారకర్తగా రోహిత్ శర్మ



పేరును ప్రకటిస్తున్నందుకు నాకు చాలా గౌరవంగా ఉంది. నిరుడు టీమిండియాను విజేతగా నిలపడంతో పాటు తొమ్మిది సీజన్లు ఆడిన రోహిత్ కంటే ఉత్తమ ప్రతినిధి మరొకరు లేరు' అని ఐసీసీ అధ్యక్షుడు జై షా తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

### అరంగేట్రంలోనే విజేతగా

టీ20ల్లో విధ్వంసక బ్యాటర్ అయిన రోహిత్ 2007లో అరంగేట్రం చేశాడు. అదే ఏడాది ఎంఎస్ ధోనీ సారథ్యంలో కప్ గెలిచిన జట్టులో అతడు సభ్యుడు. తొలి ఎడిషన్‌లో చెలరేగి ఆడిన అతడు.. సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై అజేయ హాఫ్ (50 నాటౌట్).. ఫైనల్లో పాకిస్థాన్‌పై 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. నిరుడు తన కెప్టెన్సీలో దేశానికి వరల్డ్ కప్ అందించి వీడ్కోలు పలికాడు హిట్‌మ్యాన్. బార్బడోస్‌లో టీమిండియాకు రెండో కప్ కట్టబెట్టిన అతడు.. భావోద్వేగంతో ఆటకు అల్విదా చెప్పాడు. ఈ ఫార్మాట్లో రోహిత్ 140.89 స్ట్రయిక్ రేటుతో 4,231 పరుగులు సాధించాడు.

MOVIE TIME



## 28న అఖండ-2 ప్రీరిలీజ్ ఈవెంట్

### ముఖ్య అతిథిగా రానున్న సీఎం రేవంత్

**టాకీస్:** నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండ-2. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ 2 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న నిర్వహించబోయే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గ అనుమతుల కోసం నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.

## వారణాసి లెవల్లో ఎన్టీఆర్-నీల్ మూవీ ప్రమోషన్ ?



**టాకీస్:** వారణాసి మూవీ టైటిల్‌ను భారీ ఈవెంట్ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. భారతీయ సినిమా ప్రమోషన్స్‌కు ఇది కొత్త నిర్వచనంగా మారింది. ఈ వినూత్న ప్రయత్నం దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, హాలీవుడ్ మీడియా దృష్టిని కూడా ఆకర్షించి గ్లోబల్ లెవెల్‌లో పెద్ద చర్చగా మారింది. సాధారణంగా టైటిల్స్‌ను పోస్టర్, గ్లింప్స్ లేదా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రకటిస్తారు. కానీ వారణాసి యూనిట్ మాత్రం పాత్రలు, కథ, థీమ్ వివరించే క్రమంలో స్టేజ్ ఈవెంట్ ఏర్పాటు చేసి ప్రమోషన్‌లో కొత్త మైలురాయి సృష్టించింది. దీనికి మంచి రెస్పాన్స్ రావడంతో ఇప్పుడు ఇదే స్ట్రాటజీని ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న సినిమాకి ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీ టైటిల్‌పై భారీ ఆసక్తి నెలకొనగా, మూవీకి డ్రాగన్ అనే పేరు ఖరారు చేసినట్టు టాక్ వినిపిస్తుంది. అయితే డ్రాగన్' పేరు ఇంకా నిర్ధారణ కాలేదని మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ రవి శంకర్ స్పష్టం చేశారు. 'డ్రాగన్ కూడా ఓ ఆప్షన్ మాత్రమే. అధికారికంగా ఏ టైటిల్ ఫైనల్ కాలేదు. ఇది పూర్తిగా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్. ప్రశాంత్ నీల్ విజన్‌లో ఎన్టీఆర్ కొత్త అవతరం చూపించబోతున్నాడు. టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ వారణాసి మాదిరిగానే ప్రాజెక్ట్‌కి తగ్గ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తామని తెలిపారు. ఫిల్మ్ ప్రమోషన్‌లో భారీ ఈవెంట్ మోడల్ ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. సినిమా థీమ్‌ను స్పష్టంగా ప్రేక్షకులకు చెప్పే అవకాశం కలుగుతుంది. ఇలా చేస్తే గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకునే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ మీడియా సహా విదేశీ ప్రెస్ అటెన్షన్, తక్కువ సమయంలో భారీ బజ్ క్రియేట్ చేయగలగడం, కంటెంట్‌పై తప్పుదారులు వెళ్లకుండా క్లారిటీ ఇవ్వడం కొత్త ట్రెండ్‌ను ఆమోదించేలా చేశాయి. వారణాసి ఈవెంట్ తర్వాత భారతీయ సినీ పరిశ్రమలో 'టైటిల్ రివీల్ ఈవెంట్' అనే కొత్త ప్రమోషనల్ ట్రెండ్ ప్రారంభమైంది. అదే మోడ్‌లో ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ కూడా అడుగులు వేస్తుండటం అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది.

# త్వరలోనే సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వనున్న సదా




**టాకీస్:**
దర్శకుడు తేజ సినిమాలతో చాలా మంది ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. అలా వచ్చిన వారిలో సదా ఒకరు. తేజ దర్శకత్వంలో వచ్చిన జయం సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. నితిన్ హీరోగా నటించిన జయం సినిమాలో హీరోయిన్ గా సదా నటించాగా విలన్ గా గోపీచంద్ నటించాడు. ఇక ఈ సినిమాలో నటించిన అందరికి క్రేజ్ వచ్చింది. ఆతర్వాత నితిన్, సదా, గోపిచంద్ వరుస సినిమాలతో బిజీగా మారిపోయారు. సదా టాలీవుడ్ లో చాలా సినిమాల్లో నటించింది. స్టార్ హీరోలతో కూడా ఈ అమ్మడు జతకట్టింది. అలాగే తమిళ్ లోనూ సినిమాలు చేసింది. శంకర్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ నటించిన అపరిచితుడు సినిమాలో నటించింది. తెలుగు, తమిళ్ భాషల్లో విడుదలైన ఈ సినిమా ఘనవిజయాన్ని అందుకుంది. ఇదిలా ఉంటే సదా జయం సినిమా గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. జయం సినిమాలో ఓ సన్నివేశంలో నటించడానికి చాలా ఇబ్బంది పడ్డానని ఇంటికెళ్లి మరీ ఏడ్చాను.. ఇప్పటికి కూడా ఆ సీన్ ఎందుకు చేశానా అని చాలా బాధపడ్డాను అని తెలిపింది. జయం సినిమాలో విలన్ గోపీచంద్ కూడా సదాను ప్రేమిస్తాడు. అయితే సదా ప్రేమించిన నితిన్ ముందు ఆమె బుగ్గపై నాలుకతో నాకుతాడు. ఈ సన్నివేశం చేసేటప్పుడు చాలా ఇబ్బందిపడ్డాను అని సదా తెలిపింది. నేను ఆ సన్నివేశంలో నటించాను అని దర్శకుడికి ముందే చెప్పినా కూడా ఆయన వినిపించుకోలేదట. ఆ సీన్ సినిమాకు హైలైట్ అవుతుందని చెప్పి తనతో చేయించారట. ఆతర్వాత ఇంటికెళ్లి పదేపదే మొహాన్ని కడుక్కున్నా అని తెలిపింది సదా. కానీ జయం సినిమాతో తనకు ఎంతో పేరు వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం సదా పలు టీవీ షోలకు జడ్జ్‌గా వ్యవహరిస్తోంది. త్వరలోనే సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వాలని చూస్తోంది.

## భాగ్యశ్రీతో డేటింగ్ అంతా ఉత్తిదే

### కొట్టిపడేసిన హీరో రామ్





టాకీస్: ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ హీరోయిన్ జంటగా వస్తున్న మూవీ ఆంధ్రాకింగ్ తాలూకా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ సినిమా మొదలైనప్పటి నుంచి రామ్, భాగ్య శ్రీ డేటింగ్ లో ఉన్నారంటూ ఓ రేంజ్ లో రూమర్లు వస్తున్నాయి. ఇద్దరూ ప్రైవేట్ గా కలుసుకుంటున్నారని.. విదేశాలకు టూర్లకు వెళ్తున్నారంటూ రకరకాల రూమర్లు వస్తూనే ఉన్నాయి. ఇక మూవీ రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో వరుస ప్రమోషన్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్.. దీనిపై క్లారిటీ ఇచ్చారు. డేటింగ్ రూమర్లు అన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశాడు. భాగ్య శ్రీ తనకు మంచి ఫ్రెండ్ అని క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా కోసం నేను స్వయంగా ఓ లవ్ సాంగ్ రాశాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఏదో ఉందని అంతా అనుకుంటున్నారు. భాగ్య శ్రీపై ఇంట్రెస్ట్ లేకుండా ఇంత మంచి సాంగ్ రాయడు కదా అని అంతా అనుకుంటున్నారు. కానీ భాగ్యశ్రీని మా సినిమా కోసం తీసుకోక ముందే ఆ పాట రాశాను. సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రల మధ్య అంత మంచి బాండింగ్ ఉంటుంది కాబట్టే ఆ పాట బాగా వచ్చింది. అంతకు మించి మా మధ్య ఏమీ లేదు. భాగ్య శ్రీ మంచి యాక్టర్ అంటూ చెప్పాడు రామ్. భాగ్య శ్రీ కూడా ఇదే విషయంపై స్పందిస్తూ.. రామ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే అని తెలిపింది. రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి చెన్నైలో పెరిగాను. ఆయన సినిమాలన్నీ చూసేవాడిని. 'బాషా' సినిమా అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమాకు 100వ రోజు కూడా టికెట్స్ దొరకలేదు. చివరి నిమిషంలో రెండు టికెట్స్ దొరికాయి. దీంతో నేను మా ఫ్రెండ్ వెళ్లాం. ఆరోజు థియేటర్‌లో అభిమానులు ఆ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికే వాళ్లు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి ఉంటారు. డైలాగులు కూడా తెలిసిపోయి ఉంటాయి. అయినా అందరూ ఆసక్తిగా చూడడం చూసి నేను షాకయ్యానని రామ్ తెలిపాడు. ఎవరైనా సక్సెస్ కావాలంటే వారికి రెండు ప్రధాన కారణాలు ఉంటాయి.

## 28న నెట్‌ఫ్లిక్స్‌లో మాస్ జాతర రిలీజ్



**టాకీస్:** మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా కనిపించిన ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహించాడు. అక్టోబరు 31న ప్రీమియర్స్ తో వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. కానీ ప్రీమియర్ షో నుండే ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. రొటీన్ రెగ్యులర్ కథ, బోరింగ్ స్క్రీన్ ప్లేతో ఆడియెన్స్ కు విసుగుతెప్పించాడు దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ క్రింజ్ కామెడి నవ్వుతెప్పించకపోగా విసిగించింది. కనీసం మినిమం వసూళ్లు కూడా రాబట్టలేక రవితేజ కెరీర్ లో మరో డిజాస్టర్ గా మిగిలింది. రిలీజ్ కు ముందే మాస్ జాతర డిజిటల్ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. థియేటర్ లో ఫ్లాప్ అయినా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ నెల 28 నుండి నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో ఈ సినిమాను స్ట్రీమింగ్ తీసుకువస్తుంది నెట్ ఫ్లిక్స్. థియేటర్ లో రిలీజ్ అయిన 28 రోజుల తర్వాత మాస్ జాతర ను స్ట్రీమింగ్ చేస్తుంది నెట్ ఫ్లిక్స్.

## హరిణ్యారెడ్డితో 27న రాహుల్ పెళ్లి



టాకీస్: స్టార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తనకి కాబోయే భార్య హరిణ్యా రెడ్డికు ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. నవంబర్ 27న జరగనున్న వారి వివాహం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంగీత్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న ఈ సమయంలో రాహుల్ ఇచ్చిన సర్‌ప్రైజ్‌కి హరిణ్య తెగ ఫిదా అయింది. టీమ్‌ఇండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ని స్వయంగా సంగీత్ వేడుకకు ఆహ్వానించి, తన కాబోయే భార్యకు రాహుల్ స్పెషల్ ట్రీట్ ఇచ్చాడు. చాహల్‌ను చూసి హరిణ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హరిణ్య తన సోషల్ మీడియాలో .. ఇంత పెద్ద గిఫ్ట్ నా జీవితంలో మర్చిపోలేను. థ్యాంక్ యూ రాహుల్! అంటూ చాహల్‌తో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.